రిపోర్టర్లు కావలెను
జనం కోసం నిరంతరం అక్షర సమరం చేసేందుకు దూసుకు వస్తున్న 'జర్నలిస్ట్ ఫైల్' దినపత్రికకు ఏపీలో జిల్లా ప్రతినిధులుగా పనిచేయుటకు విలేకరులు కావలెను. తెలుగులో స్పష్టంగా మాట్లాడటం, ఆసక్తి, అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత. కొత్త వారికి అవకాశం ఉంటుంది.
సంప్రదించాల్సిన సెల్ నెం :
9502535152, 7416812467

శనివారం 22.06.2024

INK OF TRUTH

జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 32 సంచిక -140 www.journalistfile.com పేజీలు 4 వెల : రూ.5.00

ఏపీ అసెంబ్లీ స్పీకర్‌గా

అయ్యన్నపాత్రుడు ఎన్నిక

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : ఏపీ అసెంబ్లీ స్పీకర్ గా అయ్యన్నపాత్రుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్పీకర్ పదవి కోసం ఒకే ఒక నామినేషన్ రావడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. టీడీపీలో సీనియర్ నేతగా కొనసాగుతున్న అయ్యన్నకూటమి ఎమ్మెల్యేల్లో అత్యంత సీనియర్. ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ పెట్టిన ఏడాది 1983లో తొలిసారి నర్సీపట్నం నుంచి విజయం సాధించిన ఆయన ఇప్పటి వరకు ఏడుసార్లు ఎమ్మెల్యేగాగెలుపొందారు. ఒకసారి అనకాపల్లి ఎంపీగానూ విజయం సాధించారు. పలు శాఖలకు మంత్రిగా పనిచేశారు.

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తరుపున ఆయన నామినేషన్ పత్రాలను అసెంబ్లీ కార్యదర్శికి అందజేశారు. ఈ నామినేషన్ కార్యక్రమంలో డీప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రులు లోకేష్, పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్, నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. ఇక రేపు అసెంబ్లీలో స్పీకర్ ను ఎమ్మెల్యేలు ఎన్నుకోనున్నారు.

టీడీపీ సీనియర్ నేతగా మంత్రివర్గంలో చోటు దక్కని చింతకాయల అయ్యన్నపాత్రుడికి కీలక పదవి ఇవ్వాలని చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. ఈక్రమంలో ఆయన్ను ఏపీ స్పీకర్‌గా నియమించేందుకు చంద్రబాబు సిద్ధమయ్యారు. అలాగే ఎన్నికల్లో కీలకంగా వ్యవహరించిన జనసేనకు డిప్యూటీ స్పీకర్ పదవి ఇవ్వాలని చంద్రబాబు నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మండలి బుద్ధప్రసాద్, బొలిశెట్టి శ్రీనివాస్, లోకం మాధవి పేర్ల చంద్రబాబు పరిశీలిస్తున్నారు. ఈ ముగ్గురిలో ఒకరిని డిప్యూటీ స్పీకర్ పదవి వరించే అవకాశం ఉంది. చీఫ్‌విఫ్‌గా దూళిపాళ్ల నరేంద్ర పేరు పరిశీలనలో ఉంది.

వెంటనే సభ నుంచి వెళ్లిపోయిన జగన్.. టీడీపీ తీవ్ర విమర్శలు..!

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : జగన్ ఎమ్మెల్యేగా ప్రమాణం చేసిన వెంటనే సభ నుంచి వెళ్లిపోయారు. కనీసం కూర్చోకుండా జగన్ బయటకు వెళ్లిపోవడంపై టీడీపీ సభ్యుల నుంచి తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే సీటులో కూర్చోకుండా ఇంతవరకూ ఏ ఎమ్మెల్యే వెళ్లిపోలేదంటూ ధూళ్లిపాళ్ల ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఓడిపోయిన తర్వాత జగన్ ఎలా ఉన్నాడో చూడాలని తమ వాళ్లంతా ఎదురుచూశారని అన్నారు. జగన్ తన రాజ్యం లాక్కున్నట్లు ఫీల్ అయినట్లు అనిపించిందని ధూళ్లిపాళ్ల కామెంట్స్ చేశాడు. ప్రమాణ స్వీకార సమయంలో జగన్ మాటలు తడబడి పేరు కూడా తప్పుగా చదివాడని పేర్కొన్నారు.

జగన్ ప్రమాణ స్వీకారం చేస్తున్నప్పుడు ఆయన ముఖ కవళికలను బిగ్ స్క్రీన్‌పై ఆసక్తిగా గమనించారు చంద్రబాబు, మంత్రులు, ఎమ్మెల్యేలు. జగన్ సభలోనికి వచ్చి కూర్చోగానే బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ఆయన వద్దకు వెళ్లి చేతులు కలిపి నమస్కరించారు. ప్రమాణ స్వీకారం చేసిన తరువాత బీజేపీకి చెందిన మంత్రి సత్యకుమార్ జగన్ వద్దకు వెళ్లి చేతులు కలిపారు. తాను ప్రమాణస్వీకారం చేసిన వెంటనే సభ నుంచి జగన్ బయటకు వెళ్లిపోయారు. సభలో వున్నంతసేపు జగన్ ముభావంగా కనిపించారు.

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): ఏపీ సీఎం చంద్రబాబు రెండున్నరేళ్ల తర్వాత అసెంబ్లీలోకి అడుగుపెట్టారు. వైసీపీ నేతలు తీవ్రంగా కించపరడంతో సీఎంగానే మళ్లీ అడుగుపెడతానని 2021లో ఆయన శపథం చేశారు. అది నేడు నెరవేరింది. సమావేశాల ప్రారంభం నేపథ్యంలో అసెంబ్లీకి చంద్రబాబు వచ్చారు. తొలుత అక్కడి మెట్ల వద్ద ప్రణమిల్లి లోపలికి అడుగుపెట్టారు. అనంతరం శాసనసభాపక్ష నేత కార్యాలయంలో పండితులు ఆయనకు వేదాశీర్వచనం చేశారు. ఆ తర్వాత శాసనసభకు చేరుకున్నారు. ఈ సందర్భంగా 'నిజం గెలిచింది.. ప్రజాస్వామ్యం నిలిచింది' అంటూ తెదేపా ఎమ్మెల్యేలు ప్లకార్డులు ప్రదర్శించారు. సభలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ ఆలింగనం చేసుకున్నారు.

తన సతీమణి వ్యక్తిత్వాన్ని కించపరిచేలా అసెంబ్లీలో అప్పటి మంత్రి అంబటి రాంబాబు మాట్లాడటం, దానికి కొందరు వైకాపా సభ్యులు వంతపాడటం, సభా నాయకుడిగా వారించాల్సిన అప్పటి సీఎం జగన్ వెకిలి నవ్వులతో వారిని ప్రోత్సహించడంతో చంద్రబాబు ఆరోజు తీవ్ర మనస్తాపం చెందారు.

గెలుపు ఓటమి సహజం. గెలిచామని విర్రవీగకూడదు, ఓడిపోయామని కృంగిపోకూడదు. ముఖ్యంగా ప్రజా నాయకుడు గెలిచినప్పుడు వినమ్రంగా, ఓడినప్పుడు ధైర్యంగా, పరిస్థితి ఎలాంటిదైనా ధైర్యంగా నిలబడి తన వాళ్లను కాపాడుకోవాలి. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రజలకు మార్గదర్శిలా ఉండాలి. అంతా అయిపోయింది అని అందరూ అనుకున్న అందరి అంచనాలను తలకిందులు చేస్తూ పడిన చోటునుండి కెరటంలా పైకి రావాలి అని నిరూపించారు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. నాడు భీష్మ శపథం చేసి అసెంబ్లీ నుండి బయటకు వచ్చిన నారా చంద్రబాబు నాయుడు అన్నమాట ప్రకారం మళ్లీ నేడు సీఎంగా అసెంబ్లీలో అడుగు పెట్టారు. 2019 ఎన్నికల్లో వైసీపీ 151 సీట్లను సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అప్పటి వరకు ఏ ప్రభుత్వానికి రానన్ని సీట్లు వైసీపీకి రావడంతో, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆ విజయం శాశ్వతంగా ఉంటుందని భ్రమించారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజం అనే విషయాన్ని మర్చిపోయారు. తాను రాజ్యాంగబద్ధ పదవిలో, గౌరవప్రధమైన సభలో ఉన్న విషయాన్ని విస్మరించారు.

ప్రజా సమస్యలపై చర్చించాల్సిన అసెంబ్లీలో ప్రతిపక్ష నేతలపై వ్యక్తిగత విమర్శలు చేశారు. ముఖ్యంగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా అసెంబ్లీలో అడుగుపెట్టిన మొదటి రోజు నుండి అప్పటి ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు నాయుడిని అవమానించడమే పనిగా పెట్టుకున్నారా అనేలా జగన్ వ్యవహరించారు అనడంలో ఎలాంటి సందేహంలేదు. రాజకీయ పరిజ్ఞానంలోనూ, వయసులోనూ తన కంటే పెద్దవారేన చంద్రబాబును వైఎస్ జగన్ అదికారదర్పంతో అవమానించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఒకానొక సమయంలో నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరిని నిండు సభలో వైసీపీ ఎమ్మెల్యేలు అవమానించారు. ఈ నేపథ్యంలో భావోద్వేగానికి లోనైన చంద్రబాబు ఇలాంటి కౌరవ సభలో తాను ఉండలేనని, మళ్లీ ముఖ్యమంత్రిగానే సభలో అడుగుపెడతానని గత 2021 నవంబరు 19వ తేదీన శపథం చేసి అసెంబ్లీ నుండి బయటకు వచ్చేశారు. కాగా 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అఖండ విజయాన్ని కైవసం చేసుకుని ఆంధ్రాలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో రెండున్నరేళ్ల తరువాత మళ్లీ అసెంబ్లీలో ముఖ్యమంత్రిగా అడుగుపెట్టి నాడు ఆయన చేసిన శపథాన్ని నేడు నెరవేర్చుకున్నారు.

గతంలో చంద్రబాబు చేసిన శపథమిదీ.. : "ఇన్నేళ్లూ పరువు కోసం బతికాను. అలాంటిది ఈ రోజు సభలో నా భార్య ప్రస్తావన తెచ్చి అసభ్య వ్యాఖ్యలు చేశారు. ఇది గౌరవ సభ కాదు, కౌరవ సభ. ఇలాంటి సభలో నేనుండను. మళ్లీ ముఖ్యమంత్రిగానే ఈ సభలో అడుగుపెడతాను. లేకపోతే నాకు రాజకీయాలే వద్దు. మీ అందరికీ ఓ నమస్కారం" అని 2021 నవంబరు 19న శాసనసభలో చంద్రబాబు తీవ్ర అవమానభారంతో భీషణ ప్రతిజ్ఞ చేశారు. ఆ రోజు నుంచీ ఆయన అసెంబ్లీ సమావేశాలకు వెళ్లలేదు. ప్రజాక్షేత్రంలోనే వైసీపీపై బదులు తీర్చుకుని, ప్రతిజ్ఞ నెరవేర్చుకున్నారు. మళ్లీ ముఖ్యమంత్రిగానే సభలో అడుగు పెట్టారు.

ఈవీఎంల ట్యాంపరింగ్...
జగన్ వ్యాఖ్యలు సరికాదన్న వైసీపీ నేత

పొలిటికల్ డెస్క్ (జర్నలిస్ట్ ఫైల్) : ఇటీవల ఏపీలో జరిగిన ఎన్నికల్లో వైసీపీ ఘోర ఓటమిని చవిచూసింది. దీంతో వైసీపీ శ్రేణులు ఊహించని ఓటమితో అసహనం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో మాజీ సీఎం జగన్ ఓటమి అనంతరం వైసీపీ నేతలతో సమావేశం ఏర్పరచారు. అసలు ఓటమికి గల కారణం ఏంటి అని చర్చలు జరిపారు. వైఎస్ జగన్,

2 లో

డిప్యూటీ సీఎం గారికి కోపమొచ్చింది

కేంద్రం ఇచ్చిన నిధులు మళ్లింపుపై ఆగ్రహం

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): ఇటీవల ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన జనసేన చీఫ్ పవన్ కల్యాణ్.. పాలనలో తనదైన శైలీలో దూసుకుపోతున్నారు. డిప్యూటీ సీఎంగా చార్జ్ తీసుకున్న వెంటనే తన శాఖలకు సంబంధించిన అధికారులతో వరుస రివ్యూలు నిర్వహిస్తూ దూకుడు ప్రదర్శిస్తున్నారు. ఈ క్రమంలోనే శుక్రవారం పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎం హోదాలో పంచాయతీ రాజ్, పురపాలక, వైద్యారోగ్య శాఖలపై సమీక్ష నిర్వహించారు. మంత్రులు నారాయణ, సత్యకుమార్, చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ ప్రసాద్ ఈ సమావేశానికి హాజరయ్యారు.

ఈ క్రమంలో కేంద్ర నిధుల మళ్లింపు విషయంలో అధికారులపై పవన్ సీరియస్ అ

2 లో

డీజీపీగా బాధ్యతలు చేపట్టిన ద్వారకా తిరుమలరావు

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన డీజీపీగా సీహెచ్ ద్వారకా తిరుమలరావు బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం ఉదయం కుటుంబ సమేతంగా ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను దర్శించుకున్నారు. అనంతరం మంగళగిరిలోని రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు. పోలీసుల గౌరవందనం స్వీకరించారు. ఆ తర్వాత నూతన డీజీపీగా సంతకం చేసి బాధ్యతలు స్వీకరించారు. ఏడీజీ శంకరబత్ర బాగ్చీ, కేఎల్ మీనా, అతుల్ సింగ్, ఐజీ వినీత్ బ్రిజ్ లాల్, శ్రీకాంత్, డీఐజీ రాజకుమారి, నవీన్ జెట్టి, మోహన్ రావు తదితరులు ద్వారకా తిరుమలరావుకు అభినందనలు తెలిపారు.

1989 బ్యాచ్ ఐపీఎస్ అధికారైన ద్వారకా తిరుమలరావు ప్రస్తుతం రాష్ట్ర క్యాడర్ ఐపీఎస్ అధికారుల సీనియారిటీ జాబితాలో అగ్రస్థానంలో ఉన్నారు. కర్నూలు ఏఎస్పీగా మొట్టమొదటి పోస్టింగ్ చేపట్టారు. తర్వాత కామారెడ్డి, ధర్మవరంలో ఏఎస్పీగా పనిచేశారు. నిజామాబాద్ జిల్లా ఆపరేషన్స్ విభాగం అదనపు ఎస్పీగా కీలక బాధ్యతలు నిర్వహించారు. ఎస్పీగా పదోన్నతి పొందాక %శా% అనంతపురం, కడప, మెదక్ జిల్లాలతో పాటు విజయవాడ రైల్వే, సీఐడీ, సీబీఐ విభాగాల్లో ఎస్పీగా పనిచేశారు. అనంతపురం, హైదరాబాద్ రేంజ్‌లతో పాటు ఎస్ఐబీలో డీఐజీగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆక్టోపస్, కౌంటర్ ఇంటెలిజెన్స్ సెల్ విభాగాల్లో ఐజీగా పనిచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో సైబరాబాద్ పోలీసు కమిషనర్‌గా, రాష్ట్ర విభజన తర్వాత విజయవాడ నగర పోలీసు కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. 2021 జూన్ నుంచి ఇప్పటి వరకు ఆర్టీసీ ఎండీగా పనిచేశారు. తిరుమలరావుకు నిక్కచ్చిగా వ్యవహరించే సమర్థ అధికారిగా పోలీసు శాఖలో గుర్తింపు ఉంది.

ఇసుక, మద్యం అక్రమాలపై విచారణ జరపాలి

ముఖ్యమంత్రికి ఏపీ బీజేపీ అధ్యక్షురాలు లేఖ

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు బీజేపీ ఏపీ అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి లేఖ రాశారు. ఈ లేఖలో పలు కీలక అంశాలను ఈ లేఖ ద్వారా సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఇసుక తవ్వకాలకు డిజిటల్ చెల్లింపులు జరిగేలా చేయాలని కోరారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ప్రమాణాలను పాటిస్తూ ఇసుక తవ్వకాలు జరగాలి.. భారీ మెషీన్లతో ఇసుక తవ్వకాలు జరపకూడదు అని సూచించారు.. ఇదే సమయంలో గత ఐదేళ్లలో జరిగిన ఇసుక తవ్వకాలపై విచారణ జరిపించాలని కోరారు.. టాటా, బిర్లాల ద్వారా శుద్ధి చేసిన ఇసుక 25 కేజీల బస్తాలలో అందించేలా చూడాలన్నారు.

మరోవైపు.. మద్య నియంత్రణ, క్వాలిటీ లిక్కర్ పై చర్యలు తీసుకోవాలని సీఎంను కోరారు. "ఇప్పటి వరకూ ఉన్న డిస్టిలరీస్ పై విచారణ జరిపించాలి.. ముడి సరుకుల వినియోగం, లిక్కర్ తయారీ పై విచారణ జరగాలన్నారు. ఇథనాల్ కంటే సగం ఖర్చుతో లభించే సింథటిక్ ఆల్కహాల్ వినియోగంపై విచారణ జరగాలి.. కాలం చెల్లిన డిస్టిలేషన్, శుద్ధి యంత్రాల వినియోగం పరిశీలించాలి.. కలర్, ఫ్లేవర్ల కోసం సింథటిక్ కెమికల్స్ వినియోగంపై విచారణ చేయించాలి.. 6 నుంచీ 12 నెలలు చెక్క బ్యారెల్స్ లో నిల్వ ఉంచిన ఆల్కహాల్ ను బాటిళ్ళలో నింపేలా చూడాలి.. శాంపిల్స్ ను ప్రతీవారం నేషనల్ లేబరేటరీలలో పరీక్షలు జరిపించాలి.. డిజిటల్ చెల్లింపులను పూర్తిస్థాయిలో అమలు పరచాలి.. పరివర్తన తీసుకొచ్చేందుకు రిహేబిలిటేషన్ సెంటర్లను రాష్ట్రం అంతా ప్రారంభించాలి.. బలవంతంగా లీజుకు తీసుకున్న లిక్కర్ తయారీ కేంద్రాలను తక్కువ రేట్లకే తిరిగి తీసుకోవాలి.. బ్రూవరీస్ కార్పొరేషన్ లో కరప్షన్ పై విచారణ జరిపించాలి" అంటూ సీఎం చంద్రబాబు దృష్టికి తన లేఖ ద్వారా తీసుకెళ్లారు.

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అన్ని కమిటీలు రద్దు

విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) : ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అనూహ్య నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర కాంగ్రెస్‌లోని అన్ని విభాగాలు రద్దు చేసింది. ఈ విషయాన్ని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల ప్రకటించారు. పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగానే కమిటీల రద్దు నిర్ణయం తీసుకున్నామని, త్వరలో కొత్త కమిటీలతో రాబోతున్నామని ఆమె పేర్కొన్నారు. ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ దారుణమైన ఫలితాల్ని చవిచూసింది. దీంతో ఢిల్లీకి షర్మిలను రప్పించుకున్న హైకమాండ్.. ఫలితాలపై సమీక్షించడంతో పాటు పార్టీ పునర్మిర్మాణంపైనా చర్చించినట్లు తెలుస్తోంది.



ఎమ్మెల్యేగా జగన్ ప్రమాణం

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సాధారణ ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రతిపక్ష హోదా కూడా దక్కకపోవడంతో సాధారణ ఎమ్మెల్యేగా ప్రమాణం చేశారాయన. మంత్రులు ప్రమాణ స్వీకారం చేశాక వైఎస్ జగన్ ప్రమాణం చేశారు. ఇటీవలి జరిగిన ఎన్నికల్లో కేవలం ఆ పార్టీ 11 సీట్లకే పరిమితమవ్వడంతో కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కకపోవడం విశేషం. కాగా, ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత జగన్ అసెంబ్లీ నుంచి వెళ్లిపోయారు. అంతకుముందు అసెంబ్లీ గేటు వెనుక నుంచి ప్రాంగణంలోకి జగన్ వచ్చారు. గతంలో సీడ్ యాక్సెస్ రోడ్డు నుంచి మందడం మీదుగా అసెంబ్లీకి వచ్చేశారు. ఆయన కారును లోనికి వచ్చేందుకు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావులు అనుమతించారు.

ముందుగా చంద్రబాబు,ఆ తర్వాత పవన్.వరుసగా మంత్రులు

ముందుగా సీఎం చంద్రబాబు ఎమ్మెల్యేగా ప్రమాణం చేశారు. ఆ తరువాత ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, అచ్చెన్నాయుడు, టీజీ భరత్, కందుల దుర్గేశ్, ఎన్ ఎం డీ ఫరూక్, బీసీ జనార్ధన్ రెడ్డి, నారా లోకేశ్ ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. వీరి తర్వాత వైసీపీ అధినేత వైఎస్ జగన్ ప్రమాణ స్వీకారం చేశారు. వారి తర్వాత ఎమ్మెల్యేలు ఆంగ్ల అక్షరాల క్రమంలో ఎమ్మెల్యేలు ఒక్కొక్కరుగా ప్రమాణ స్వీకారం చేశారు.

డిప్యూటీ సీఎం గారికి కోపమొచ్చింది

(మొదటి పేజీ తరువాయి)

య్యారు. గుంటూరు, విజయవాడలో డయేరియా ప్రబలడంపై అధికారులను ప్రశ్నించారు. కేంద్రం ఇచ్చిన నిధులు ఏమైపోయాయంటూ పవన్ అడిగిన ప్రశ్నలకు అధికారులు నీళ్లు నమిలిట్లు సమాచారం. సెంట్రల్ గవర్నమెంట్ ఫండ్స్ ను ఎవరి ఆదేశాల మేరకు ఎంతమేర మళ్లించారో పూర్తి నివేదిక కావాలని పవన్ సీఎస్ ను ఆదేశించారు.

శుక్రవారం నాడు అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణం స్వీకారం చేసిన అనంతరం నేరుగా తన చాంబర్‌కు వెళ్లిన పవన్ కల్యాణ్.. మళ్లీ రివ్యూ సమావేశాలతో బిజి అయిపోయారు. పంచా యతీరాజ్ శాఖకు సంబంధించిన అధికారుల తో సమావేశం నిర్వహించిన పవన్ కల్యాణ్.. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులు, ఆర్థిక సంఘం నిధులపై ఆరా తీశారు. అసలు ఈ నిధులన్నీ సీఎఫ్ఎంయస్‌కు ఎందుకు మళ్లించారని అధికారులను పవన్ నిలదీశారు. పంచాయతీలు, స్థానిక సంస్థలకు వెళ్లాల్సిన నిధులను ఇష్టానుసారం ఎందుకు మళ్లిం చారు? అని సంబంధిత అధికారు లపై పవన్ కన్నెర్రజేశారు. నిధులు ఏమేరకు మళ్లించారో తనకు వెంటనే నివేదిక ఇవ్వాలని అధికారులను ఆయన ఆదేశించారు. కేంద్రం ఇచ్చే నిధుల మళ్లింపు, సీరియస్ అంశమన్నారు.

ఆయా శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలను నిధుల మళ్లింపుపై పవన్ నిలదీశారు. కేంద్రం నుంచి వచ్చిన నిధులు ఎంత..? సీఎఫ్ఎంఎస్‌కు ఎంత మళ్లించారు..? ఎందుకు మళ్లించారు..? ఎవరి ఆదేశాలతో నిధులు మళ్లించారు..? అనేది పూర్తిగా నివేదిక రూపంలో ఇవ్వాలని ఛీఫ్ సెక్రటరీని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. నిధులు మళ్లింపుపై పవన్ నిలదీయడంతో అధికారులు నీళ్లు నమిలారు. అనంతరం.. గ్రామాలు, పట్టణాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గుంటూరు, విజయవాడలో డయేరియా వచ్చి మనుషులు చనిపోవడంపై పవన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు అధికారులు బదులిస్తూ.. నిధులు లేవని చెప్పారు. అసలు కేంద్రం నుంచి వచ్చిన నిధులు ఎందుకు మళ్లించారు..? అని మరోసారి అధికారులను పవన్ నిలదీయడం జరిగింది.

ఈవీఎంల ట్యాంపరింగ్... జగన్ వ్యాఖ్యలు సరికాదన్న వైసీపీ నేత

(మొదటి పేజీ తరువాయి)

పలువురు వైసీపీ నేతలు ఈవీఎంల ట్యాంపరింగ్ జరిగిందని ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈవీఎంలపై వైసీపీ అనుమానాలు వ్యక్తం చేస్తున్న వేళ ఆ పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ వ్యతిరేక స్వరం వినిపించారు. ఈవీఎంల ట్యాంపరింగ్ అనేది శుద్ధ అబద్ధం అని కొట్టిపారేశారు. మూడు పార్టీల ఓట్లు కలిసిపోవడంతోనే ఇలాంటి ఫలితం వచ్చిందన్నారు. కాగా 2019లో రాపాక వరప్రసాద్ జనసేన తరపున ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ తర్వాత వైసీపీలో చేరారు. ఈ ఎన్నికల్లో అమలాపురం వైసీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు.

చిత్తూరు గంగాధర నెల్లూరు సిఐ మారుతి శంకర్ కి జైలు శిక్ష

చిత్తూరు (జర్నలిస్ట్ ఫైల్): చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు సిఐ మారుతి శంకర్ కి ఏడాది జైలు శిక్షతోపాటు రూ. 10వేల జరిమానాను కోర్టు విధించింది. గతంలో సిఐ మారుతి శంకర్ కర్నూలు జిల్లా పగిడ్యాల ఎస్సైగా పనిచేశారు. అక్కడ ఘనాపురం గ్రామానికి చెందిన నరేంద్ర రెడ్డి ని 2015లో విచారణ కోసం పోలీస్ స్టేషనుకు పిలిపించి నరేంద్ర పై ఎస్సై మారుతి శంకర్ దాడి చేశారు. దీనిపై నరేందర్ రెడ్డి ఎస్సై మారుతి శంకర్ పై ప్రైవేట్ కేసు వేశారు. ఈ ఘటనపై కేసు నమోదు కాగా సిఐ మారుతి శంకర్ కి కోర్టు ఏడాది జైలు శిక్ష 10000 జరిమానా విధించింది. ప్రస్తుతం గంగాధర్ నెల్లూరు సిఐగా మారుతి శంకర్ పనిచేస్తున్నారు.

మాజీ మంత్రి కొడాలి నానిపై కేసు నమోదు!

గుడివాడ (జర్నలిస్ట్ ఫైల్): ఎన్నికలకు ముందు పలువురు వార్డు వలంటీర్లతో వైసీపీ నేతలు రాజీనామాలు చేయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే తాజాగా మాజీ మంత్రి, వైసీపీ నేత కొడాలి నానికి గట్టి షాక్ తగిలింది. మాజీ వార్డు వలంటీర్లు ఆయనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమను వేధించి కొడాలి నాని తమతో బలవంతంగా రాజీనామా చేయించారంటూ వలంటీర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కొడాలి నానిపై గుడివాడ పోలీసులు కేసు నమోదు చేశారు. కొడాలి నానితో పాటు ఆయన సన్నిహితుడు దుక్కిపాటి శశిభూషణ్, గుడివాడ పట్టణ వైసీపీ అధ్యక్షుడు గొర్ల శ్రీను మరో ఇద్దరు వైసీపీ నేతలపై 447, 506 ఐపీసీ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది.

అసెంబ్లీలోకి అడుగుపెట్టిన పవర్ స్టార్.. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): మొదటిసారిగా ఎమ్మెల్యేగా అసెంబ్లీలో ప్రమాణం చేశారు జనసేన అధినేత పవన్ కళ్యాణ్. మొదటగా సీఎం చంద్రబాబు ప్రమాణం చేయగా.. ఆ తర్వాత మొదటిసారిగా అసెంబ్లీలో ప్రమాణం చేశారు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్.కాగా, ఏపీ శాసనసభ సమావేశాలు శుక్రవారం ఉదయం 9.46 గంటలకు ప్రారంభం అయ్యాయి. దాదాపు రెండున్నరేళ్ల తర్వాత సీఎం చంద్రబాబు నాయుడు సభలోకి అడుగుపెట్టారు. మొదట ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించిన అనంతరం ఆయన అసెంబ్లీకి వచ్చారు. అసెంబ్లీ మెట్లకు ప్రణమిల్లిన ఆయన సగౌరవంగా గౌరవ సభలోకి అడుగుపెట్టారు. మొదటగా సభ్యులంతా జాతీయ గీతం ఆలపించారు. అనంతరం ప్రొటెం స్పీకర్ నియామకంపై అసెంబ్లీ కార్యదర్శి ప్రకటన చేశారు. ఆ తర్వాత సభ్యులు ప్రమాణ స్వీకారం చేసి రిజిస్టర్లలో సంతకాలు చేశారు.

డయేరియా విషయంలో నిర్లక్ష్యం వహించొద్దు

- మెరుగైన వైద్య సేవల్ని అందించాలి
- అధికారులను ఆదేశించిన వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్
- జగ్గయ్యపేటలో డయేరియా ప్రబలడం పట్ల మంత్రి ఆరా
- గురువారం అర్ధరాత్రి హుటాహుటిన జగ్గయ్యపేటకు పరుగులు తీసిన అధికారులు
- మంత్రి ఆదేశాలతో గురువారం రాత్రంతా జగ్గయ్యపేటలోనే ఎన్టీఆర్ జిల్లా డిఎంహెచ్వో
- ఎప్పటికప్పుడు పరిస్థితిని ఫోన్లో అడిగి తెలుసుకుంటున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి
- సందర్శించిన ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య
- పరిస్థితి అదుపులో ఉంది, ఆందోళన పడొద్దు:డిఎంహెచ్వో డాక్టర్ సుహాసిని

విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్): జగ్గయ్యపేట పరిసర ప్రాంతాల్లో అక్కడక్కడా డయేరియా కేసులు నమోదవుతున్న నేపథ్యంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆరా తీశారు. మంత్రి ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ శాఖాధికారి డాక్టర్ యం.సుహాసిని, వైద్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్ తన బృందంతో ఆయా ప్రాంతాల్లో హూటాహుటిన గురువారం అర్ధరాత్రి సందర్శించారు. డయేరియా నివారణా చర్యలు చేపట్టారు. వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

అనుమంచిపల్లి , బూదవాడ, జగ్గయ్యపేట టౌన్, షేర్ మహమ్మద్ పేట లకు చెందిన కొంతమంది విరోచనాలతో బాధపడుతున్నారని, వారు వెంకట సన్నీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని డిఎంహెచ్వో డాక్టర్ సుహాసిని తెలిపారు. వారు కూడా క్షేమంగా ఉన్నారని, ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదని ఆమె తెలిపారు. ఈ ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులు వివిధ ప్రాంతాలకు చెందిన వారని ఆమె తెలిపారు. పరిస్థితులు అదుపులోనే ఉన్నాయన్నారు.

సందర్శించిన ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య

జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య డయేరియా ప్రబలిన ప్రాంతాల్ని గురువారం రాత్రి సందర్శించారు. బాధితులకు మెరుగైన వైద్య చికిత్సను అందించాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖామంత్రి సత్య కుమార్ యాదవ్, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ఎప్పటికప్పుడు ఫోన్ ద్వారా వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు.

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎమ్. సుహాసిని గురువారం రాత్రంతా అక్కడే ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించారు. వైద్యాధికారి డా.అనిల్ కుమార్. ఎఎన్ ఎం లు,ఆశా కార్యకర్తలు స్థానికంగా వైద్య సేవలందిస్తున్నారు

జూలై 1 నుండి వరకు డయేరియా నియంత్రణపై రాష్ట్ర వ్యాప్త ప్రచార కార్యక్రమం

- డయేరియా నియంత్రణకు కట్టుదిట్టమైన కార్యాచరణ ప్రణాళిక అమలు చేయండి
- మంచినీటి పైపులైన్లు, ఓహెచ్ఎస్ఆర్లు లీకేజిలు లేకుండా చూడండి
- జిల్లా కలక్టర్ల నేతృత్వంలో సంబంధిత శాఖలతో సమన్వయ సమావేశం నిర్వహించాలి
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): డయేరియా నియంత్రణ,వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు జూలై 1వ తేదీ నుండి ఆగస్టు 31 వరకు రెండు మాసాల పాటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రచార కార్యక్రమాన్నినిర్వహించనున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో ఆయన ఈ అంశంపై సంబంధిత శాఖల అధికారులు,జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయేరియా వ్యాధి నియంత్రణకు యుద్ధ ప్రాతిపదికన కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని పంచాయితీ రాజ్,ఆర్డబ్ల్యుఎస్,వైద్య ఆరోగ్య,మున్సిపల్ శాఖల అధికారులను ఆదేశించారు.రాష్ట్రంలో గత నాలుగు నెలల కాలంలో గుంటూరు,విజయవాడ, కాకినాడ,జంగారెడ్డిగూడెం తదితర ప్రాంతాల్లో డయేరియా వ్యాధి ప్రబలి అనేక మంది ఆనారోగ్యం పాలై ఆసుపత్రిల్లో చేరారని ఫిబ్రవరిలో ఒక వ్యక్తి డయేరియాతో చనిపోయారని తెలిపారు.అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని సిఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదేశించారు.

రాష్ట్రంలో 217 తాగునీటి సోర్సుల్లో నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించగా వాటర్ కంటామినేషన్ ఉన్నట్టు పరీక్షల్లో తేలిందని ఆయా వాటర్ సోర్సుల్లో వెంటనే నీటి కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టాలని పంచాయితీరాజ్,ఆర్ డబ్ల్యుఎస్,మున్సిపల్ శాఖల అధికారులను సిఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదేశించారు.అలాగే వివిధ డ్రైన్ల గుండా వెళ్ళే తాగునీటి పైపులైన్ల లీకేజీలను అరికట్టాలని,ఒ హెచ్ఎస్ఆర్ లను కూడా పూర్తిగా తనిఖీ చేసి లీకేజీలను నియంత్రించాలని చెప్పారు.గ్రామ వార్డు సచివాలయాల సిబ్బందిని,ఎఎన్ఎం అంగన్ వాడీ,వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పూర్తి భాగస్వామ్యంతో వ్యక్తిగత పరిశు భ్రతపై ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని పెద్దఎత్తున చేపట్టాలని సిఎస్ ఆదేశించారు. ఈ సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి యంటి.కృష్ణ బాబు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నీటి నాణ్యత పరీక్షలను పెద్దఎత్తున నిర్వహించాలని,నూరు శాతం మంచినీటి సోర్సులను తనిఖీ చేయాలని కలక్టర్లకు స్పష్టం చేశారు.

మంచినీటి పైపులైన్ల మరమ్మత్తులు,లీకేజీల నియంత్రణకు తీసుకున్నచర్యలపై ఆర్డబ్ల్యుఎస్,మున్సిపల్,పంచాయితీ రాజ్ శాఖల నుండి నివేదికలు స్వీకరించి ఎక్కడా డయేరియా వ్యాధి ప్రభలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.జూలై 1 నుండి ఆగష్టు 31 వరకూ రెండు నెలల పాటు నిర్వహించే డయేరియా నియంత్రణ ప్రచార కార్యక్రమాన్నిఐదేళ్ళ లోపు చిన్నారులు ఎవరూ డయేరియాతో చనిపోకూడదనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈకార్యక్ర మాన్నిచేపట్టిందని కృష్ణబాబు పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో భాగంగా వ్యక్తిగత పరిశుభ్రత,చేతులను సుభ్రంగా ఉంచుకోవడం,వ్యర్థాల సక్రమ నిర్వహణ,సురక్షిత తాగునీరు,ఫంక్షనల్ టాయిలెట్సుపై ఇంటింటా ప్రచార కార్యక్రమం చేపట్టి ఓఆర్ఎస్ ఫ్యాకెట్లు,జింక్ ట్యాబ్లెట్లు పంపిణీకి చర్యలు తీసుకోవాల్సిఉంటుందన్నారు.అదే విధంగా రోటావైరస్,మీజిల్స్ ఇంజక్షన్లు వేయడం వంటి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. హైరిస్క్ ఏరియాల్లో ర్యాఫిడ్ యాక్సన్ చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని సంబంధిత శాఖల భాగస్వామ్యం తోపాటు వివిధ స్వచ్ఛంధ సంస్థలను కూడా ఈప్రచార కార్యక్రమంలో భాగస్వాములను చేయాల్సి ఉంటుందని చెప్పారు.జిల్లా స్థాయిలో జిల్లా కలక్టర్ల నేతృత్వంలో సంబంధిత శాఖలతో సమన్వయ సమావేశం నిర్వహించి డయేరియా నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని స్పెషల్ సిఎస్ కృష్ణబాబు కలక్టర్లకు సూచించారు.

ఈ ప్రచార అవగాహన కార్యక్రమంలో భాగంగా జిల్లాస్థాయిలో ఈనెల 22లోపు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఇంటర్ సెక్టోరల్ టాస్కు ఫోర్సు కమిటీని ఏర్పాటు చేసి ఓఆర్ఎస్,జింక్,ఐవి ఫ్లూఇడ్స్ సరిపడిన స్టాకు అందుబాటులో ఉంచాల్సి ఉంటుందని స్పెషల్ సిఎస్.కృష్ణబాబు తెలిపారు.ఈనెల 24లోపు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ హెల్తు అండ్ వెల్నెస్ ఐదేళ్ళ లోపు చిన్నారులను గుర్తించడం చేయాలని ఈనెల 24 నుండి 30 వ తేదీ లోపు విలేజి,వార్డు సచివాలయాలు,విలేజ్ హెల్తు క్లినిక్,పిహెచ్సి,యుహెచ్సి మరియు జిల్లా స్థాయి మైక్రో ప్లాన్ రూపొందించుకుని ఏఆర్ఎస్,జింక్ కార్నర్,కమ్యునికేషన్ స్ట్రాటజీ మానిటరింగ్ మెకానిజాన్ని రూపొందిం చుకోవాల్సి ఉంటుందని చెప్పారు.అలాగే డయేరియా నియంత్రణపై ఈనెల 24 నుండి 30 వరకు గ్రామ,వార్డు సచివాలయాలు,విలేజ్ హెల్తు క్లినిక్లు,పిహెచ్సి,జిల్లా స్థాయిలో అందరు స్టేక్ హెూల్డర్లకు కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని స్పెషల్ సిఎస్ కృష్ణ బాబు తెలిపారు.

రాష్ట్ర మున్సిపల్ మరియు పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్ మాట్లాడుతూ వివిధ పట్టణ ప్రాంతాల్లో డయేరియా నియంత్రణకు సంబంధించి మున్సిపల్ కమీషనర్ల బాధ్యులను చేయాలని కలక్టర్లకు స్పష్టం చేశారు.వివిధ తాగునీటి సోర్సులు,పైపులైన్ల నిర్వహణపై తీసుకుంటున్న చర్యలను సమీక్షించాలని చెప్పారు.

రాష్ట్ర పంచాయితీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శులు శశి భూషణ్ కుమార్ మాట్లాడుతూ ఆర్డబ్ల్యుఎస్ విభాగం వద్ద గ్రామ,మండల,జిల్లా స్థాయిల్లో వాటర్ క్వాలిటీ పరీక్షల కిట్లు అందుబాటులో ఉన్నాయని కావున పెద్దఎత్తున నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించాలని చెప్పారు.స్త్రీశిశు సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి మాట్లాడుతూ అన్నిఅంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులందరికీ సురక్షిత,వేడి నీళ్ళు తాగించే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

ఈ సమావేశంలో పిఆర్ అండ్ ఆర్డి కమీషనర్ కె.కన్నబాబు,వైద్య ఆరోగ్యం కుటుంబ సంక్షేమశాఖ కమీషనర్ డా.వెంకటేశ్వర్,సిడిఎంఏ శ్రీధర్,ఇఎన్సిలు కృష్ణారెడ్డి,ఆనందరావు తదితర అధికారులు పాల్గొన్నారు.అలాగే వివిధ జిల్లాల కలెక్టర్లు వర్చువల్ గా పాల్గొన్నారు

తొలి రోజు 172 మంది సభ్యుల ప్రమాణ స్వీకారం

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): ఏపీ అసెంబ్లీ సెషన్ శనివారానికి వాయిదా పడింది. అంతకుముందు ఎమ్మెల్యేలతో ప్రమాణ స్వీకారం చేయించారు ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి. ముందుగా సీఎం నారా చంద్రబాబు నాయుడు ఎమ్మెల్యేగా ప్రమాణం చేయగా ఆ తరువాత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రమాణ స్వీకారం చేశారు. వీరి తర్వాత మంత్రులు ఒక్కొక్కరిగా ప్రమాణాన్ని పూర్తి చేశారు. మంత్రుల ప్రమాణ స్వీకారం పూర్తి కాగానే మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ ప్రమాణం చేశారు. ఆ తరువాత ఎమ్మెల్యేలు ఒక్కొక్కరిగా ప్రమాణ స్వీకారం చేశారు. మొత్తం 175 మంది ఎమ్మెల్యేలు ఉండగా 172 మంది ఇవాళ ప్రమాణం చేయగా వ్యక్తిగత కారణాలతో ముగ్గురు సభ్యులు సభకు హాజరు కాలేకపోయారు. హాజరుకాని జీవీ ఆంజనేయులు, వనమాడి వెంకటేశ్వరరావు, పితాని సత్యనారాయణ శనివారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇక ప్రమాణం పూర్తి చేసిన ఎమ్మెల్యేలకు శాసనసభ వ్యవహారాల కార్యాలయం రూల్స్ బుక్, రాజ్యాంగ పుస్తకాలతో కూడిన కిట్ బ్యాగును అందజేసింది. ఇదిలా ఉండగా అసెంబ్లీ స్పీకర్ పదవికి చింతకాయల అయ్యన్న పాత్రుడు నామినేషన్ దాఖలు చేశారు. అతని తరఫున కూటమి సభ్యులు నామినేషన్ దాఖలు చేయగా.. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు, సత్యకుమార్, నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. శనివారం సభ్యులందరి ప్రమాణం పూర్తయ్యాక స్పీకర్‌ను ఎన్ను కోనున్నారు ఎమ్మెల్యేలు. కాగా రేపు ఉదయం 10.30 గంటలకు అసెంబ్లీ ప్రారంభం కానుంది.

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఓఎస్‌డీగా యువ ఐఏఎస్ అధికారి కృష్ణతేజ

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ(ఓఎస్‌డీ)గా కేరళలో పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యువ ఐఏఎస్ అధికారి మైలవరపు వీఆర్ కృష్ణతేజ రానున్నారు. సాధారణంగా ఆర్‌డీఓ స్థాయి అధికారులను మంత్రులకు ఓఎస్‌డీలుగా నియమిస్తారు. అయితే పవన్‌కల్యాణ్ కోసం.. ఐఏఎస్ అధికారి అయిన కృష్ణతేజ నియామకానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక అనుమతి ఇచ్చారు. ప్రస్తుతం కేరళలోని త్రిసూర్ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనను డిప్యుటేషన్‌పై రాష్ట్రానికి పంపాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. కృష్ణతేజ గతంలో కేరళ పర్యాటకాభివృద్ధి సంస్థ ఎండీ, పర్యాటకశాఖ డైరెక్టర్, ఎస్సీ అభివృద్ధిశాఖ డైరెక్టర్, అలప్పుజ జిల్లా కలెక్టర్‌గా సేవలందించారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన కృష్ణతేజ రెండు రోజుల కిందట సచివాలయంలో పవన్‌కల్యాణ్‌ను కలిశారు. త్రిసూర్ జిల్లా కలెక్టర్‌గా కృష్ణతేజ అందించిన సేవలకు గాను జాతీయ బాలల రక్షణ కమిషన్ ఆయనను పురస్కారానికి ఎంపిక చేసింది. బాలల హక్కుల రక్షణలో త్రిసూర్ జిల్లాను ఆయన దేశంలోనే అగ్రగామిగా నిలిపారు. 2015 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన ఆయన.. 2023 మార్చిలో కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. కరోనా కారణంగా తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన 609 మంది విద్యార్థులను గుర్తించి.. దాతల సహకారంతో ఉన్నత చదువులకు చేయూత అందించారు. కరోనా సమయంలో భర్తలను పోగొట్టుకున్న 35 మంది వితంతువులకు ఇళ్లు నిర్మించడంతోపాటు 150మందికి ఉపాధి అవకాశాలు కల్పించారు. ఐఏఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఆయన అద్భుత పనితీరుతో తనదైన ముద్ర వేస్తున్నారు

నూతన డీజీపీకి శుభాకాంక్షలు తెలిపిన పోలీస్ అధికారుల సంఘం

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిజిపి గా బాధ్యతలు స్వీకరించిన సి. హెచ్. ద్వారకా తిరుమలరావుకు ఆంధ్రప్రదేశ్ పోలీస్ అధికారుల సంఘం శుభాకాంక్షలు తెలిపింది. ఈ సందర్భంగా పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జనకుల శ్రీనివాసరావు మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రడిజిపి గా నిజాయితీతో, నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించే ద్వారకా తిరుమలరావును నియమిస్తూ ఆదేశాలు జారీ చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఆంధ్రప్రదేశ్ పోలీస్ అధికారుల సంఘం ధన్యవాదాలు తెలియజేసింది భారతదేశంలోనే అత్యున్నత దర్యాప్తు సంస్థ అయిన సీబీఐ పాటు రాష్ట్రంలో ప్రత్యేక దర్యాప్తు సంస్థ అయిన సీఐడి తోలో పనిచేసిన ఘన చరిత్ర ద్వారక తిరుమలరావుకు వుందని. సైబరాబాద్, విజయవాడ లాంటి మహానగరాల్లో కమిషనర్ ఆఫ్ పోలీస్ గా విధులు నిర్వర్తించి ప్రజల నుండి ప్రశంసలు అందుకున్న ద్వారక తిరుమలరావు... ఎక్కడ విధులు నిర్వర్తించినా పోలీసుశాఖలోని క్షేత్రస్థాయి సిబ్బంది వారి కుటుంబాల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి ఈ రాష్ట్రానికి డిజిపిగా బాధ్యతలు స్వీకరించడం శుభసూచకం అన్నారు.

యువతిని హత్య చేసిన వారిపై కఠిన చర్యలు హెూం మంత్రి వంగలపూడి అనిత

బాపట్ల (జర్నలిస్ట్ ఫైల్): చీరాల మండలం ఈపురుపాలెంలో బహిర్భూమికి వెళ్లిన యువతి దారుణ హత్యకు గురైందని హెూం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. యువతిపై దారుణంగా అత్యాచారం చేసి హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ తల్లిదండ్రులు కూడా చూడలేని అచేతన స్థితిలో యువతి ఉందన్నారు. ఇలాంటి సంఘటన చూస్తుంటే సభ్యసమాజంలో ఉన్నామా.. లేదా అని భయం వేస్తుందని చెప్పారు. గంజాయి , డ్రగ్స్ మత్తులో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని తెలిపారు.

గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ఇలాంటి ఘటనలు చాలా జరిగాయన్నారు. యువతిపై అత్యాచారం, హత్య ఘటనపై సీఎం చంద్రబాబు సీరియస్‌గా స్పందించారని చెప్పారు. నిందితులను వెంటనే పట్టుకోవాలని ఆదేశించారని అన్నారు. ప్రభుత్వం నుంచి యువతి కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. యువతి కుటుంబానికి రూ. 10 లక్షలు పరిహారాన్ని చంద్రబాబు ప్రకటించారని చెప్పారు.గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకుంటామని హెూం మంత్రి అనిత పేర్కొన్నారు.

ఆయుధాల డంప్ స్వాధీనం

అల్లూరి సీతారామరాజు (జర్నలిస్ట్ ఫైల్): అల్లూరి సీతారామరాజు జిల్లా చర్ల మండల సరిహద్దు ఒడిశా–ఆంధ్రప్రదేశ్ సరిహద్దు బెజంగివాడ రిజర్వ్ ఫారెస్టులో ఒక పర్వత కుహరంలో మావోయిస్టులు దాచిన ఆయుధాల డంప్ ను శుక్రవారం భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నారు. దూలగండి గ్రామ సమీపంలో మావోయిస్టుల డంప్ నుంచి ఎస్బిఎంఎల్ గన్స్, బారెల్, ఎలక్ట్రిక్ డిటోనేటర్స్, జిలెటిన్ స్టిక్స్, డైరెక్షనల్ మైన్, సోలార్ ప్లేట్, వైర్, ఎల్పీజి సిలిండర్స్, స్విచులు, మెడిసిన్స్ భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నారు.

తెలంగాణా వార్తలు

కాంగ్రెస్‌లో చేరిన పోచారం శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్(జర్నలిస్ట్ ఫైల్): మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఉదయం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పోచారంతోపాటు ఆయన కుమారుడు కూడా కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి పోచారం ఎన్నో సేవలందించారని ప్రశంసించారు. ఆయనకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు.

అప్పుడు కేంద్రంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమే..

హైదరాబాద్(జర్నలిస్ట్ ఫైల్): ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బొగ్గు గనుల వేలం బిల్లుకు బీఆర్ఎస్ మద్దతు ఇచ్చిందనడాన్ని ఖండిస్తున్నానని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలపై ఆయన తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. భట్టి అవగాహన ఉండి కూడా అబద్ధాలు మాట్లాడుతున్నారా? లేక అవగాహన లేక మాట్లాడుతున్నారా? అని ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో ఈరోజు (శుక్రవారం) వినోద్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ... 2011లో ఆ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిందే కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వమని స్పష్టం చేశారు.

ఆ తర్వాత కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిందని అన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపు ఆర్డినెన్సు రూపంలో చట్టం చేసిందన్నారు. బిల్లు పెట్టింది కాంగ్రెస్, ఆర్డినెన్సు తెచ్చింది బీజేపీ అని తేల్చిచెప్పారు. భట్టి విక్రమార్క వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు. సెక్షన్ 17కింద యాక్షన్ లేకుండా బొగ్గు గనులు రాష్ట్ర ప్రభుత్వాలకు ఇవ్వొచ్చని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డి, భట్టి కేంద్రం వద్దకు వెళ్లాలి.. బొగ్గుగని వేలంను ఆపాలని హితవు పలికారు. తాము మద్దతు ఇచ్చాయనే మాటను విక్రమార్క ఉపసంహరించుకోవాలని కోరారు. సింగరేణిని చంపేయడానికి పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి సంబంధించిన 8మంది ఎంపీలను గెలిపించారా అని ప్రశ్నించారు.

కవిత జ్యూడిషియల్ కస్టడీ పొడిగింపు

హైదరాబాద్(జర్నలిస్ట్ ఫైల్): ఎమ్మెల్సీ కవిత జ్యుడిషియల్ కస్టడీని రౌస్ అవెన్యూ కోర్టు పొడిగించింది. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో అరెస్టు అయిన విషయం విదితమే. కాగా, ఆమె జ్యుడిషియల్ కస్టడీని జులై 7వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు కోర్టు పేర్కొంది. ఈ కేసులో ఆమె జ్యూడిషియల్ కస్టడీ శుక్రవారంతో ముగియనుంది. దీంతో కోర్టు ఎదుట వర్చువల్ గా సీబీఐ అధికారులు హాజరుపరిచారు. అయితే ఇదే కేసులో అరెస్టు కాబడిన ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు రౌస్ అవెన్యూ కోర్టు సాధారణ బెయిల్ మంజూరుపై చేయగా హైకోర్టు స్టే ఇవ్వడం విశేషం.

సింగరేణికే బొగ్గు గనులు కేటాయించండి

కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి ఉప ముఖ్యమంత్రి భట్టి వినతి

హైదరాబాద్(జర్నలిట్ ఫైల్): సింగరేణికి భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని రిజర్వేషన్ ప్రకారం సింగరేణికి బొగ్గు బ్లాకులు కేటాయించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వినతిపత్రం అందజేశారు. నేడు 10వ బొగ్గు వేలం ప్రక్రియను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హైదరాబాద్ లో లాంచనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భట్టి మాట్లాడుతూ, సింగరేణి బొగ్గు గనుల వేలం నిలిపివేయాలని కేంద్ర మంత్రిని అభ్యర్థించారు.. కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ నుంచి కాకుండా మొట్టమొదటి సారి కమర్షియల్ బొగ్గు గనుల వేలం ప్రక్రియ హైదరాబాద్ లో నిర్వహిస్తున్నారని అన్న భట్టి. కిషన్ రెడ్డికి తెలంగాణ పరిస్థితులు బాగా తెలుసన్నారు. సింగరేణి సంస్థ తెలంగాణ రాష్ట్రానికి ఆయువు పట్టు, కొంగుబంగారం అన్నారు.

సింగరేణి బొగ్గు వల్లే మన రాష్ట్రంలో థర్మల్ ప్లాంట్స్ నడుస్తున్నాయన్నారు. 130 ఏళ్ల అనుభవం ఉన్న సింగరేణి సంస్థకు కొత్త బ్లాక్ లు కేటాయించాల్సిన అవసరం ఉందని తెలిపారు. త్రైపాక్షిక ఒప్పందాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని తెలిపారు. 1400 వందల మిలియన్ టన్నులు బొగ్గును తియ్యడానికి అవకాశం ఇంకా ఉందని తెలిపారు. 2015లో కొత్త చట్టం వల్ల సింగరేణి తనకు ఉన్న అర్హతలను కోల్పోయిందని తెలిపారు. సత్తుపల్లి, కోయగూడ, మరో రెండు బ్లాక్ లను సింగరేణికి కేటాయించాలని కేంద్రం వద్ద ప్రతిపాదన ఉందన్నారు. సింగరేణి ప్రభుత్వ సంస్థకు కేంద్రం సింగరేణికి సహకారం ఇవ్వకపోవడం బాధాకరం అన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల గతంలో ప్రైవేట్ సంస్థల చేతుల్లోకి కోల్ బ్లాక్ కు వెళ్లాయన్నారు. రిజర్వేషన్లు పక్కన పెట్టి ప్రైవేటీకరణ దిశగా వేలం పాట నడవడం వల్ల సింగరేణికి నష్టం వాటిల్లిందన్నారు. ఇదే విధంగా కొనసాగితే 2039 నాటికి సింగరేణి మూతపడే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. . . .

రిజర్వేషన్ కోటా లో బొగ్గు బ్లాక్ లు కేటాయించే అంశంలో కిషన్ రెడ్డి చొరవ చూపాలని అన్నారు. అలాగే కిషన్ రెడ్డి అవకాశం ఇస్తే అఖిల పక్షంగా వచ్చి ప్రధానిని కలుస్తామని తెలిపారు. సింగరేణి సంస్థకు కొత్త గనులు కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు.

సింగరేణి సంస్థ బతకాలి అంటే కొత్త గనులు కేటాయించడం ఎంతో అవసరముందుని తెలిపారు. సత్తుపల్లి, కొయగూడ బ్లాక్ ల పాత లీజు రద్దు చేసి..వాటిని సింగరేణికి కేటాయించాలి కోరుతున్నామన్నారు. సింగరేణి భవిషత్ కోసం మరో 0.5 పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సింగరేణి సంస్థను కాపాడేందుకు చట్టంలో మార్పులు చేయాలని భట్టి డిమాండ్ చేశారు.

అత్యంత వైభవంగా బోనాలు నిర్వహించాలి: పొన్నం ప్రభాకర్

హైదరాబాద్(జర్నలిస్ట్ ఫైల్): హైదరాబాద్ కలెక్టరేట్‌లో ఆషాడ మాసం బోనాల వేడుకలపై తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటేలా బోనాల ఉత్సవాలు నిర్వహించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత తొలిసారిగా జరుపుకుంటున్న బోనాల పండుగను గతంలో కంటే అత్యంత వైభవంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.

జిల్లాలోని 2,400 ఆలయాలకు చెక్కుల పంపిణీ త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈసారి ఆలయాలకు ఇచ్చే సొమ్మును పెంచాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశాల మేరకు సీఎం రేవంత్‌రెడ్డి దఅష్టికి తీసుకెళ్లినట్లు మంత్రి వెల్లడించారు. బోనాల సందర్భంగా ఆలయాలకు వచ్చే యాత్రికులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కాగా, వచ్చే నెల 7 నుంచి బోనాల ఉత్సవం ప్రారంభం కానుంది.

జూలై 7న ఆషాఢమాసం మొదటి ఆదివారం భాగ్యనగరంలో బోనాల సంబరం ప్రారంభమవుతుంది. గోల్గండ ఎల్లమ్మ ఆలయంలో తొలి పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి, లాల్ దర్వాజ మహంకాళి ఆలయాల్లో ప్రతి గురు, ఆదివారాలు నెల రోజుల పాటు నిర్వహిస్తారు.

జూలై 7వ తేదీ ఆదివారం – గోల్గండ జగదాంబికకు తొలిబోనం సమర్పించడంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. జూలై 11 గురువారం – రెండవ పూజ, జూలై 14 ఆదివారం – మూడవ పూజ కాగా.. జూలై 18 గురువారం – నాల్గవ పూజ నిర్వహిస్తారు. జూలై 21 ఆదివారం – ఐదవ పూజ, జూలై 25 గురువారం – ఆరోపూజ, జూలై 28 ఆదివారం – ఏడవ పూజ కాగా.. ఆగస్ట్ 1 గురువారం – ఎనిమిదవ పూజ అనంతరం.. ఆగస్టు 4 ఆదివారం – తొమ్మిదవ పూజ చేస్తారు. అంటే జూలై 7వ తేదీ ఆదివారం ప్రారంభమయ్యే బోనాలు ఆగస్టు 4వ తేదీ ఆదివారంతో ముగుస్తాయి.

పోచారం ఇంటి వద్ద ఆందోళన... మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అరెస్ట్

హైదరాబాద్(జర్నలిస్ట్ ఫైల్): మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మరోసారి వార్తల్లో నిలిచారు. ఈరోజు హైదరాబాద్ లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ ఇంటి దగ్గర బాల్క సుమన్ నేతృత్వంలో ఆందోళన నిర్వహించారు. ఆ క్రమంలో పోచారం ఇంట్లోకి బీఆర్ఎస్ నేతలు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో బాల్కసుమన్ పోలీసులతో వాగ్వాదానికి దిగారు.

ఆ క్రమంలో పోలీసులు బీఆర్ఎస్ నేతలను అడ్డుకోగా పోచారం ఇంటి వద్ద ఉద్రిక్త పరిస్థితి చోటుచేసుకుంది. ఎంత సేపటికీ వినకపోవడంతో బాల్క సుమన్ తో పాటు పలువురు బీఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని సమాచారం తెలుసుకుని ఆయన ఇంటి వద్దకు చేరుకుని బాల్క సుమన్ నేతృత్వంలో ఆందోళన చేపట్టారు. అప్పటికే పోచారం సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు.

ఈడీ, ఐటీ దాడులతో వేధింపులు

హైదరాబాద్(జర్నలిస్ట్ ఫైల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిపక్ష ఎమ్మెల్యేలను ఈడీ, ఐటీ దాడులతో వేధిస్తున్నాయని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపించారు. గురువారం పటాన్చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఇంట్లో ఈడీ సోదాలు జరిగిన నేపథ్యంలో శుక్రవారం ఎమ్మెల్యే సోదరుడు మధుసూదన్ రెడ్డి ఇంటికి హరీశ్ వచ్చారు. ఈడీ అధికారుల సోదాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన తోపాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్ రావు, మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ వచ్చారు.

కొత్త రాష్ట్రాల ఏర్పాటుకు తెలంగాణ సక్సెస్‌ఫుల్ మోడల్‌గా నిలిచిందని 'ది ఎకనమిస్ట్' పేర్కొంది: కేటీఆర్

హైదరాబాద్(జర్నలిస్ట్ ఫైల్): మరిన్ని కొత్త రాష్ట్రాలను ఏర్పాటు చేసేందుకు తెలంగాణ ఒక సక్సెస్‌ఫుల్ మోడల్‌గా నిలిచిందంటూ ప్రపంచ ప్రఖ్యాత మ్యాగజైన్ 'ది ఎకనమిస్ట్' రాసిన కథనాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్వీట్ చేశారు. ఈ మేరకు 'తెలంగాణ మోడల్' అంటూ కథనాన్ని ఇచ్చింది. ఈ కథనాన్ని కేటీఆర్ ట్వీట్ చేశారు.

కొత్త రాష్ట్రమైన తెలంగాణ పదేళ్లలో అద్భుతమైన ప్రగతిని సాధించిందని, తద్వారా మరిన్ని కొత్త రాష్ట్రాలు ఏర్పాటు చేసేందుకు ఒక సక్సెస్‌ఫుల్ మోడల్‌గా నిలిచిందని పేర్కొందని కేటీఆర్ తెలిపారు. ఇప్పటికైనా పదేళ్ల తెలంగాణ ప్రగతి ప్రస్థానంపై బురద జల్లడం మానుకొని, అభివృద్ధి యజ్ఞాన్ని ముందుకు తీసుకుపోవాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ దేశానికే ఒక అభివృద్ధి మోడల్‌గా నిలిచిందన్నారు. కేసీఆర్ గారి పదేళ్ల పాలనలో తెలంగాణ అద్భుతమైన అభివృద్ధిని సాధించిందని పత్రిక పేర్కొందన్నారు.

యోగా కొత్త ఉపాధి అవకాశాలను సృష్టిస్తోంది..

అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ : అంతర్జాతీయ యోగా దినోత్సవం. ప్రతియేటా జూన్ 21న ఈ దినోత్సవాన్ని జరుపుకుంటుంటాం. యోగా ప్రాముఖ్యత, ప్రయోజనాల గురించి ప్రజలకు తెలియజేసేందుకు ఈ యోగా దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. ప్రపంచ స్థాయిలో యోగాపై ప్రజలకు అవగాహన కల్పించడం, దీనిని జీవనశైలిలో భాగం చేసుకునేలా ప్రజలను ప్రేరేపించడం దీని ప్రధాన లక్ష్యం. కాగా శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా ప్రజలు, రాజకీయ, సినీ ప్రముఖులు యోగా దినోత్సవ కార్యక్రమాల్లో పాల్గొని యోగాసనాలు వేశారు. జమ్మూ కాశ్మీర్ రాజధాని శ్రీనగర్ లోని దాల్ సరస్సు ఒడ్డున నిర్మించిన షేర్-ఎ-కశ్మీర్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ సెంటర్ లో జరిగిన యోగా దినోత్సవ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొని యోగాసనాలు వేశారు.



మోదీ మాట్లాడుతూ.. విదేశాల్లోనూ యోగాచేసేవారి సంఖ్య క్రమంగా పెరుగుతోందని అన్నారు. 2015లో తొలిసారి యోగా గురించి ప్రస్తావించాక మార్పు మొదలైందని, పదేళ్లుగా ప్రపంచ వ్యాప్తంగా యోగా దినోత్సవం నిర్వహించుకుంటున్నామని మోదీ గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఫ్రాన్స్ కు చెందిన 101 ఏళ్ల మహిళా యోగా గురువు గురించి మోదీ ప్రస్తావించారు. ఈ ఏడాది పద్మశ్రీతో ఆమెను సత్కరించినట్లు గుర్తు చేశారు. ఆమె ఎప్పుడూ భారత్ కు రాకపోయినప్పటికీ యోగాపై అవగాహన కల్పించడంకోసం తన జీవితాన్ని ధారపోశారని మోదీ కొనియాడారు. యోగా ఇప్పుడొక దైనందిన కార్యక్రమమైందని, దీని ప్రాముఖ్యతను అనేక దేశాధినేతలు తనని అడిగి తెలుసుకున్నారని మోదీ తెలిపారు.

ప్రపంచం నలుమూలల నుంచి ప్రజలు భారతదేశానికి వస్తారు.. ఎందుకంటే వారు ప్రామాణికమైన యోగా నేర్చుకోవాలి. ప్రస్తుతం జర్మనీలో 1.5కోట్ల మంది యోగా ట్రైనర్లు ఉన్నారని మోదీ అన్నారు. ఈరోజు ప్రపంచం కొత్త యోగా ఆర్థిక వ్యవస్థ ముందుకు సాగడాన్ని చూస్తోంది. యోగా టూరిజంలో రిషికేశ్ నుంచి కేరళ వరకు కొత్త ట్రెండ్ కనిపిస్తోందని మోదీ అన్నారు. విమానాశ్రయాల నుంచి హోటళ్ల వరకు యోగాకోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నారు. యోగా సంబంధిత దుస్తులు, పరికరాలు మార్కెట్లలో పెద్ద ఎత్తున అందుబాటులో ఉన్నాయి. ప్రజలు తమ ఫిట్ నెస్ కోసం వ్యక్తిగత యోగా శిక్షకులను కూడా నియమించుకుంటున్నారని మోదీ తెలిపారు. ప్రముఖ కంపెనీలు తమ ఉద్యోగుల కోసం యోగా, మైండ్‌ఫుల్‌నెస్ ప్రోగ్రామ్‌లను కూడా ప్రారంభిస్తున్నాయి. ఇది కొత్త ఉపాధి అవకాశాలను సృష్టిస్తోందని మోదీ అన్నారు.

టిఎంసి ఎమ్మెల్యేకు సిబిఐ నోటీసులు

కోల్‌కతా : పాలక తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) ఎమ్మెల్యే తపస్ సాహాకు సిబిఐ శుక్రవారం సమన్లు జారీ చేసింది. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ విభాగాల్లో చేపట్టిన నియామకాల్లో జరిగిన అక్రమాలకు సంబంధించి విచారణకు హాజరుకావాలని ఆదేశించినట్లు ఓ అధికారి తెలిపారు. రిక్రూట్ మెంట్ స్కామ్ కేసులో తెహట్టా ఎమ్మెల్యే తపస్ సాహాకు నోటీసులు జారీ చేశామని అన్నారు. సిబిఐ ఎదుట విచారణకు హాజరుకానున్నట్లు తపస్ సాహా పేర్కొన్నారు.

బెయిల్ ఆర్డర్ అప్లోడ్ కాకముందే, ఈడీ స్టే కోసం వెళ్లింది: సునీతా కేజ్రీవాల్

న్యూఢిల్లీ : ఢిల్లీ ముఖ్యమంత్రి భార్య సునీతా కేజ్రీవాల్ శుక్రవారం కీలక వ్యాఖ్యలు చేశారు. ట్రయల్ కోర్టు వెబ్ సైట్ లో బెయిల్ ఆర్డర్ అప్లోడ్ కాకముందే ఈడీ అధికారులు అరవింద్ కేజ్రీవాల్ బెయిల్ను సవాల్ చేస్తూ స్టే కోసం హైకోర్టుకు వెళ్లారని అన్నారు. దేశంలో నియంతృత్వం అన్ని హద్దులు దాటి పోయింది. ఢిల్లీ ముఖ్యమంత్రిని కేంద్ర సంస్థలు మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టా చూస్తున్నాయని పేర్కొంది. అయితే ఇంకా హైకోర్టు ఉత్తర్వులు రావాల్సి ఉంది. కోర్టు న్యాయం చేస్తుందని ఆశిస్తున్నట్లు ఆమె చెప్పారు.

మనీలాండరింగ్ కేసులో అరెస్టై జైలులో ఉన్న అరవింద్ కేజ్రీవాల్ కు ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు రూ.లక్ష వ్యక్తిగత పూచికత్తుతో గురువారం సాయంత్రం రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో ఆయన జైలు నుంచి విడుదల కావాల్సి ఉండగా, ఈడీ కేజ్రీవాల్ బెయిల్ను సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఆయన విడుదల అయితే దర్యాప్తుపై ప్రభావం పడుతుందని ఈడీ వాదించగా, క్రింది కోర్టు ఇచ్చిన బెయిల్ ఉత్తర్వులను అమలుచేయొద్దని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

ఇదిలా ఉంటే, ఢిల్లీ మంత్రి అతిషి శుక్రవారం దేశ రాజధానిలో నీటి సమస్య పరిష్కారానికి నిరాహార దీక్ష చేపట్టారు. హర్యానా ఎన్ని ప్రయత్నాలు చేసినా ఢిల్లీకి సరిపడా నీటిని అందించడం లేదని ఆమె ఆరోపించారు. హర్యానా ప్రభుత్వం ఢిల్లీకి రావాల్సిన నీటి వాటాను ఇచ్చే వరకు ఈ నిరాహార దీక్ష కొనసాగుతుందని అతిషి చెప్పారు.

దీక్ష ప్రారంభించే ముందు, మహాత్మా గాంధీకి నివాళులర్పించేందుకు మంత్రి అతిషి రాజాఘాట్ చేరుకున్నారు. ఆమె వెంట ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ భార్య సునీత, ఆప్ నేతలు సౌరభ్ భరద్వాజ్, సంజయ్ సింగ్ ఉన్నారు.

జాతీయ వార్తలు

అస్సాంలో దుర్భరంగా ఉన్న వరద పరిస్థితి

గువాహతి: అస్సాంలో శుక్రవారం కూడా వరద పరిస్థితి దుర్భరంగా ఉంది. అనేక జిల్లాల్లో ప్రజలు ఇంకా నీళ్ల మధ్యే ఉన్నారని అధికారులు తెలిపారు. కొపిలి, బరాక్, కుషియారా సహా అనేక నదులు గురువారం సాయంత్రం నుంచి ప్రమాద స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి.

అస్సాంలోని 19 జిల్లాల్లో – అంటే, బజాలీ, బక్సా, బార్ పేట, బిశ్వనాథ్, కచర్, దర్రంగ్, గోల్పాడ, హైలాకండి, హోజాయ్, కామ్ రూప్, కరీంగంజ్, కొక్రాజర్, లక్ష్మీపూర్, నాగోవ్, నల్బరీ, సోనిత్ పూర్, దక్షిణ సల్మరా, తముల్ పూర్, ఉదల్ గురి.. 4లక్షల మంది వరద నీటిలోనే బతుకీడుస్తున్నారు. గత కొన్ని రోజులుగా అస్సాంలో ఎడతెరిపి లేని వానలు పడుతున్నాయి.

48 గంటల ముందే ప్రశ్నాపత్రం లీక్

న్యూఢిల్లీ : యుజిసి-ఎన్ఇటి ప్రశ్నాపత్రం 48 గంటల ముందుగా ఆదివారమే లీకైందని, డార్క్ వెబ్‌సైట్‌లో పోస్ట్ చేశారని సిబిఐ వర్గాలు శుక్రవారం పేర్కొన్నాయి. ఆతర్వాత రూ. 6లక్షలు విక్రయించేందుకు ఎన్‌క్రిప్టెడ్ సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారని అన్నారు. ఎన్ఇటి పరీక్షలో అక్రమాలు జరిగాయంటూ ఎన్ఇటి పరీక్షను విద్యాశాఖ మంత్రి రద్దు చేస్తున్నట్లు సంగతి తెలిసిందే.

పేపర్ లీక్ ఎలా జరిగిందనేది ఇప్పటికీ తెలియలేదని ఆ వర్గాలు తెలిపాయి. పోటీ పరీక్షలను నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ (ఎన్‌టిఎ)తో కలిసి ఎన్ఇటి ఏజన్సీ పనిచేస్తోంది. పేపర్ లీక్ వెనుక పెద్ద మొత్తంలో అవినీతి రాకెట్ ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. ప్రశ్నాపత్రాలను సెట్ చేసిన వారితో సహా పరీక్షలను నిర్వహించిన అధికారులను విచారించనున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి.

ఎనిమిదో తరగతి వరకు కామన్ ఎగ్జామినేషన్ పరీక్షల రద్దు

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): ఎనిమిదో తరగతి వరకు కామన్ ఎగ్జామినేషన్ పరీక్షలను ఏపీ హైకోర్టు రద్దు చేసింది. ఈ మేరకు న్యాయస్థానం శుక్రవారం తీర్పు వెలువరించింది. ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు పరీక్షలు నిర్వహించడం, విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 29కి వ్యతిరేకమని హైకోర్టు తీర్పు చెప్పింది. కామన్ ఎగ్జామినేషన్ బోర్డుకు పాఠశాల్లో పరీక్షలు నిర్వహించే హక్కు లేదని దాఖలు చేసిన రిట్ పిటీషన్‌పై హైకోర్టు ఈ తీర్పు వెలువరించింది.

కేంద్ర చట్టాన్ని ఉల్లంఘిస్తూ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు పేరిట లక్షల రూపాయలు ప్రైవేటు పాఠశాలల వద్ద వసూళ్లు చేస్తున్నారని న్యాయవాది ముతుకుమిల్లి శ్రీవిజయ్ వాదనలు వినిపించారు. సాల్ట్ ప్రోగ్రామ్ పేరుతో ఈ పరీక్షలు నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమని న్యాయవాది పేర్కొన్నారు. కేంద్ర చట్టంలో ఉన్న సెక్షన్ 29కి ఈ కార్యక్రమం వ్యతిరేకమని పేర్కొంటూ హైకోర్టు ఈ తీర్పు ఇచ్చింది. పాఠశాల్లో ఉపాధ్యాయులు స్వయంగా ప్రశ్నాపత్రాలు తయారు చేసుకుని పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుందని న్యాయవాది శ్రీ విజయ్ పేర్కొన్నారు.

జనసేనకు డిప్యూటీ స్పీకర్ ?

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): ఏపీలో కొత్త శాసనసభ కొలువుదీరింది. కొత్తగా ఎన్నికైన సభ్యులతో ప్రొటెం స్పీకర్ గోరెంట్ల బుచ్చయ్య చౌదరి ప్రమాణ స్వీకారం చేయించారు. రేపు స్పీకర్ ఎన్నిక ఉంటుంది. అయితే.. స్పీకర్ గా అయ్యన్నపాత్రుడి ఎన్నిక ఏకగ్రీవం కానుంది. ఆయన తరపున కూటమి నేతలు నామినేషన్ దాఖలు చేశారు. అయితే.. కూటమిలో మరో కీలక భాగస్వామి అయిన జనసేనకు డిప్యూటీ స్పీకర్ పదవి దక్కడం ఖాయమని తెలుస్తోంది.

ఈ రోజు తమ పార్టీ ఎమ్మెల్యేలతో భేటీ అయిన పవన్ కల్యాణ్ అనంతరం డిప్యూటీ స్పీకర్ ఎంపిక సంబంధించి జనసేన ఎమ్మెల్యేలతో ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ భేటీ అయ్యారు. డిప్యూటీ స్పీకర్ పదవిని మన పార్టీకే కేటాయిస్తారని జనసేన ఎమ్మెల్యేలతో చెప్పిన పవన్ కల్యాణ్ చెప్పినట్లు తెలుస్తోంది. అయితే.. పంతం నానాజీ, లోకపు మాధవి పేర్లలో ఒకరి పేరును డిప్యూటీ స్పీకర్ పదవికి ఖరారు చేసే అవకాశం ఉంది.

జగన్ ను అభినందించిన రఘురామకృష్ణం రాజు

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): ఏపీ మాజీ సీఎం జగన్ ను ఉండి టీడీపీ ఎమ్మెల్యే రఘురామ కృష్ణం రాజు అభినందించారు. అసెంబ్లీ ప్రాంగణంలో ప్రమాణ స్వీకారం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీలో ఒకే నిమిషం ఉండి ప్రమాణ స్వీకారం చేసి జగన్ వెళ్లిపోవడంపై ఆర్ఆర్ఆర్ మాట్లాడుతూ.. చాలా మంది జగన్మోహన్ రెడ్డి అసెంబ్లీకి హాజరు కారని అనుకున్నారని.. కానీ వచ్చి ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసి వెళ్లిపోయారన్నారు. ఇవాళ డ్యూటీ ప్రమాణ స్వీకారం చేయడమే కాబట్టి జగన్ ను అభినందించాలన్నారు. ఘోర పరాభవం తర్వాత ఎక్కువ సేపు కూర్చోవడం కష్టమే అన్నారు. కౌరవ సభ అంటూ జగన్ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ.. ఓటమి తర్వాత ఫ్రస్ట్రేషన్లో అలా మాట్లాడటం సహజం అన్నారు. నాలుగు గోడల మధ్య ఏం మాట్లాడినా.. నలుగురి ముందుకు వచ్చి ప్రమాణ స్వీకారం చేశారు అందుకు తనను అభినందిస్తున్నా అన్నారు. కొంత మంది స్పీకర్ రూంకి వెళ్లి చేయొచ్చు అన్నారని.. కానీ ఆయన రావడం అభినందనీయమన్నారు.

షర్మిలతో రాజీ చేయాలని జగన్ కోరాడు..

● ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి సంచలన వ్యాఖ్యలు.!

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పై అసెంబ్లీ లాబీల్లో జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తన ఓటమికి చెల్లి కూడా కారణమని జగన్ గ్రహించాడన్నారు. చెల్లెలు షర్మిలతో రాజీ చేయాలని జగన్ తన తల్లిని కోరాడని ఆయన తెలిపారు. అయితే, జగనే కాంగ్రెస్ పార్టీలో చేరాలని షర్మిల చెప్పేసిందని వెల్లడించారు.

త్వరలోనే వైఎస్ వివేకా హత్య కేసులో అవినాష్‌రెడ్డి అరెస్టు అవుతారన్నారు. అవినాష్ అరెస్ట్ తర్వాత జరిగే కడప ఉప ఎన్నికల్లో భూపేష్‌రెడ్డి టీడీపీ తరపున పోటీ చేసి గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఓదార్పు యాత్ర కోసం జగన్ తక్కువలో తక్కువ..14 కారణాలు వెతుక్కుంటాడని ఏ దారి దొరక్కపోతే ఓదార్చడానికి జగన్ బాధితులను సృష్టించుకుంటారని కామెంట్స్ చేశారు.

మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఎన్ఎండీ ఫరూఖ్

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రివర్యులుగా జనాబ్ నస్యం మహమ్మద్ ఫరూఖ్ శుక్రవారం పదవీ బాధ్యతలను చేపట్టారు. రాష్ట్ర సచివాలయం 3వ బ్లాక్ లో తనకు కేటాయించిన ఛాంబర్ (రూమ్ నెంబర్ 212)లో మధ్యాహ్నం 2 గంటలకు సర్వమత ప్రార్థనలు, ప్రత్యేకంగా నమాజ్ అనంతరం మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్ బోర్డుకు సంబంధించిన ఫైళ్లను పరిశీలించి తొలిసారిగా సంతకం చేయడం జరిగిందన్నారు. ప్రధానమంత్రి జన్ వికాస్ కేంద్రం (పీఎంజేవీకే) వంటి కేంద్ర పథకాల ద్వారా మైనారిటీల కోసం నైపుణ్యాభివృద్ధి విద్య, ఆరోగ్యం, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అంశంపై ఉన్నతాధికారులతో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామన్నారు. పీఎంజేవీకే క్రింద 2014-19లో మంజూరైన రూ. 643.54 కోట్ల విలువైన 77 ప్రాజెక్టులను గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఈ క్రమంలో గత ఐదేళ్లలో ప్రాజెక్టుల విషయంలో ఎలాంటి పురోగతి లేని కారణంగా జిల్లా కలెక్టర్లకు ఉత్తర్వులు ఇచ్చి త్వరగా వాటిని పూర్తి చేయాల్సిందిగా మైనార్టీల సంక్షేమ శాఖ కార్యదర్శి .కె. హర్షవర్ధన్ కు సూచించినట్లు తెలిపారు. రాష్ట్రం తరపున కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి సమర్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరామన్నారు.

రెవెన్యూ లో ఉన్న వక్ఫ్ బోర్డును, పాఠశాల విద్యాశాఖలో ఉన్న ఉర్దూ అకాడమీని, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ వంటి వాటిని ఏకం చేసి మైనారిటీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌గా నామకరణం చేసిన ప్రక్రియలో తన పాత్రను మంత్రి ఫరూఖ్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. గతంలో మైనారిటీలోని ముస్లింలు, క్రిస్టియన్ ల అభివృద్ధికి కృషి చేశామన్నారు. ప్రస్తుతం దర్గాలు, వక్ఫ్ బోర్డుల్లో పలు సమస్యలు ఉన్నాయని తమ దృష్టికి వచ్చాయని వాటన్నింటిపై కూలంకషంగా చర్చించి పరిష్కరిస్తామన్నారు. వక్ఫ్ బోర్డుకు కోట్లాది ఆస్తులు ఉన్నాయని వాటిని కాపాడుతామన్నారు. గతంలో ముస్లిం యువత కోసం కర్నూలు, కడపలో కమర్షియల్ కాంప్లెక్స్ లు కట్టించి తద్వారా ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. ప్రస్తుతం ముస్లిం, మైనారిటీలకు ఉపాధి కల్పించే బాధ్యతను తీసుకుంటామన్నారు. చర్చిల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రిగా శ్రీ నారా చంద్రబాబు నాయుడు చేసిన కృషిని వివరించారు. హజ్ యాత్రికుల కోసం మంచి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. మైనారిటీల ఆర్థిక జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. గత ప్రభుత్వం ముస్లిం, మైనారిటీ కోసం చేసిందేమీ లేదన్నారు. పెళ్లికానుకతో సహా పలు పథకాలు, సంక్షేమం పేరుతో మభ్య పెట్టిందన్నారు.

విదేశీ విద్య కు "డా. ఏపీజే అబ్దుల్ కలాం విదేశీ విద్య"గా నామకరణం చేయడం జరిగిందన్నారు. రాష్ట్రపతిగా ఈ దేశానికి సేవ చేసిన ఆయన పేరును ఈ పథకానికి పెట్టడం సంతోషంగా ఉందన్నారు. త్వరలోనే సంబంధిత ఫైల్ ను ముఖ్యమంత్రి అనుమతి కోసం పంపిస్తామన్నారు. గతంలో విదేశీ విద్యకు ఎన్టీఆర్, అంబేద్కర్ వంటి వారి పేర్లు ఉండేవని, గత ప్రభుత్వం ఆయా పేర్లను తొలగించిన విషయాన్ని మంత్రి ఫరూఖ్ గుర్తుచేశారు. మైనార్టీల సంక్షేమం, నాణ్యమైన విద్య అమలు కోసం వందలాది కోట్లు ఖర్చు చేసిన ఘనత తమదే అన్నారు.

న్యాయశాఖ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రిగా తనకు అవకాశం కల్పించినందుకు గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు ధన్యవాదాలు తెలిపారు. ఎమెల్యేగా, మండలి ఛైర్మన్ గా, డిప్యూటీ స్పీకర్ గా, గతంలో, ప్రస్తుతం మంత్రిగా తనకు పలుమార్లు మంచి అవకాశాలు కల్పించినందుకు దివంగత ఎన్టీ రామారావు, ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు, లోకేష్‌కు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. 2024లో కూటమి ఘన విజయంపై సంతృప్తి వ్యక్తం చేశారు. తనకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మంత్రిగా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తిస్తానని రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ స్పష్టం చేశారు.

రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనారిటీ సంక్షేమ శాఖగా పదవీ బాధ్యతలు స్వీకరించిన జనాబ్ నస్యం మహమ్మద్ ఫరూఖ్ కు న్యాయ, మైనారిటీ శాఖ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్చాలు అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గుంటూరు తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు మహమ్మద్ నసీర్, మైనారిటీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ హర్షవర్ధన్, న్యాయశాఖ కార్యదర్శి ప్రభాకర్ రావు, వక్ఫ్ బోర్డు సీఈవో అబ్దుల్ ఖాదర్, ఉర్దూ అకాడమీ డైరెక్టర్ మస్తాన్ వలీ, ఎంహెచ్ పీఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు మౌలానా హుస్సేన్ అహ్మద్, న్యాయ, మైనారిటీ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రబీ కరువు పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వానికి నివేదిక

- రబీ కరువు పరిస్థితులను అధ్యయనం చేసిన కేంద్ర బృందం..
- నష్టపోయిన పంట వివరాలపై కేంద్ర ప్రభుత్వానికి నివేదిక..
- రైతులను ఆదుకోవడానికి సత్వరమే రూ.319.77 కోట్లు సాయం చేయాలి..
- ఉపాధి హామీ పథకం క్రింద అదనంగా మరో 50 పని రోజులు కల్పించాలి..
- అజయ్ జైన్, రాష్ట్ర విపత్తుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): రబీ కరువు పరిస్థితులను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసిన కేంద్రబృందాన్ని సాయం అందించే విషయంలో ఉదారంగా స్పందించాలని రాష్ట్ర విపత్తుల శాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి శ్రీ అజయ్ జైన్ కోరారు. ఇందులో భాగంగా విజయవాడలోని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో ఆయన శుక్రవారం కేంద్ర కరువు బృందంతో సమావేశమై రాష్ట్రంలో కరువు పరిస్థితులను వివరించారు.

నెల్లూరు, కర్నూలు, సంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, ప్రకాశం జిల్లాల్లోని కరువు ప్రభావిత మండలాల్లో నాలుగు రోజులుగా పర్యటించిన కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన సీఈఓ, రైతు సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ రితేష్ చౌహాన్ నేతృత్వంలోని సభ్యులు డా. పొన్నుస్వామి, సునీలే దుబే, చిన్మయ్ పుండ్లికరావు గోత్కరే, ఆశిష్ పాండే, అరవింద్ కుమార్ సోని, మన్నూజీ ఉపాధ్యాయ్, ఎస్ సి కశ్యప్, మదన్ మోహన్ మౌర్య, అనురాధ బట్నా ఈ మేరకు స్పెషల్ సీఎస్ అజయ్ జైన్, ఎండి రోణంకి కూర్మనాథ్, ఇతర అధికారులతో భేటీ యై చర్చించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర విపత్తుల శాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి అజయ్ జైన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కరువు పరిస్థితులను కేంద్ర బృందానికి వివరించారు. ఆరు జిల్లాల్లో 63 తీవ్ర కరువు మండలాలు, 24 మధ్యస్థ కరువు మండలాలుగా ప్రకటించినట్లు తెలిపారు. సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షపాతం, వర్షాభావంతో అత్యధిక డ్రైస్పెల్స్, రిమోట్ సెన్సింగ్, సాయిల్ మోయిశ్చర్, హైడ్రాలజీ, పంట నష్టం 33% అంతకంటే ఎక్కువ ఉన్న మండలాలను పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం కరువు ప్రాంతాలను ప్రకటించిందని అన్నారు. క్షేత్రస్థాయిలో కరువు నష్టానికి సంబంధించి వాస్తవిక వివరాలను అందించామని, రైతులను ఆదుకోడానికి సత్వరమే రూ. 319.77 కోట్లు సాయం చేయాలని కోరారు. అలాగే, ఉపాధిహామీ పథకం క్రింద అదనంగా మరో 50 పనిరోజులు కల్పించాలని కేంద్ర బృందానికి అజయ్ జైన్ విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన సీఈఓ, రైతు సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ శ్రీ రితేష్ చౌహాన్ మాట్లాడుతూ.. కరువు కారణంగా నష్టపోయిన పంటల వివరాలను కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపుతామని వెల్లడించారు. పంట నష్టం జరిగిన రైతులను అన్ని విధాలా ఆదుకునేలా చూస్తామన్నారు. జిల్లాల్లో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ కరువు పరిస్థితుల వాస్తవికతను తెలియజేశాయని, అదేవిధంగా క్షేత్రస్థాయిలో రైతులు కరువు వల్ల జరిగిన నష్టాన్ని వివరించారని చెప్పారు. త్వరగా కమిటీ నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందించి వీలైనంత మేర ఆదుకోవడానికి తమవంతు సహకారాన్ని అందిస్తామని రితేష్ చౌహాన్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యవసాయ శాఖ కమిషనర్ సి. హరి కిరణ్, రిహాబిలిటేషన్ అండ్ రీసెటిల్మెంట్ శాఖ కమిషనర్ డా. సి.శ్రీధర్, పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ ఆర్. అమరేంద్ర కుమార్, పీఆర్ ఆర్డి జాయింట్ కమిషనర్ శివ ప్రసాద్, ఆర్ డబ్ల్యూ ఎస్ ఈ ఎన్ సీ చీఫ్ ఇంజినీర్ -2 శ్రీమతి టి. గాయత్రి దేవీ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ %డ% అర్బన్ డెవలప్మెంట్ జాయింట్ డైరెక్టర్ రవీంద్ర, భూగర్భ జలవనరుల శాఖ జాయింట్ డైరెక్టర్ ఎన్. శ్రీనివాసరావు, భూగర్భ జలవనరులశాఖ డిప్యూటీ డైరెక్టర్ . విశ్వేశ్వరరావు, వాటర్ రిసోర్స్ డిపార్ట్మెంట్ డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ తిరుమలరావు, అర్బన్ వాటర్ సప్లై శాఖ చీఫ్ ఇంజినీర్ బ్రహ్మాజీ, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు ఆదుకోవాలి.. కలెక్టరేట్ ఎదుట వాలంటీర్ల ఆందోళన..!

కాకినాడ (జర్నలిస్ట్ ఫైల్): కాకినాడ జిల్లాలో వాలంటీర్లు ఆందోళన చేపట్టారు. తమను తమ కుటుంబాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదుకోవాలని జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. వైసీపీ నాయకులు ఒత్తిడి చేస్తేనే రాజీనామా చేసినట్లు వాపోతున్నారు. తాము ఏ రాజకీయ పార్టీలకి చెందిన వళ్ళం కాదని.. ప్రజలకు సేవ చేయడానికే వాలంటీర్లుగా జాయిన్ అయ్యామని కామెంట్స్ చేశారు.

గతంలో తప్పుగా మాట్లాడి ఉంటే క్షమించండి అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తమ మొర విని తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. తమ ఉద్యోగాలు తమకు తిరిగి ఇవ్వాలని జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం అందజేశారు.

మత్స్యకారుడి వేషంలో అసెంబ్లీకి వెళ్లిన ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): నరసాపురం జనసేన ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ శుక్రవారం తొలిసారిగా ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగు పెట్టారు. అమరావతిలో అసెంబ్లీకి విన్నూత్నంగా మత్స్యకారుడు (జాలరి) వేషధారణతో అసెంబ్లీకి వెళ్లారు. నడుముకి చేపలు వేసుకునే తాటాకు బుట్ట, కుడి చేతిలో వల, ఎడమ చేతిలో చేపలు, పంచె, రబ్బరు చెప్పులతో నడిచి అసెంబ్లీకి వెళ్లారు. ఈయన మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన నాయకుడు కావడంతో ఇలా వెళ్లారు. మత్స్యకారుల సమస్యలు అసెంబ్లీలో ప్రస్తావించనున్నట్లు ఆయన తెలిపారు.

మహిళపై హత్యాచారం.. సంఘటనా స్థలానికి వెళ్లవలసిందిగా హోంమంత్రికి సీఎం చంద్రబాబు ఆదేశం

బాపట్ల (జర్నలిస్ట్ ఫైల్): బాపట్ల జిల్లా చీరాల మండలం ఈపురుపాలెంలో సుచరిత హత్యకు గురైంది. ఈపూరుపాలెంలోని రైల్వే పట్టాల సమీపంలో యువతి మృతదేహం లభ్యమైంది. యువతిని అత్యాచారం చేసి హత్య చేశారు. డెడ్ బాడీని చూసిన స్థానికులు ఘటనపై వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. యువతి ఒంటి పైన కొట్టిన దెబ్బలు ఉన్నట్లు సమాచారం. సంఘటన స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్.. బాధిత యువతి నెల్లూరు జిల్లా వాసి సుచరిత గా గుర్తించారు.

స్పందించిన చంద్రబాబు

సుచరిత హత్యపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. హత్య జరిగిన ప్రాంతానికి వెళ్లాలని హోంమంత్రి వంగలపూడి అనితను ఆదేశించారు. వెంటనే ఘటన ప్రాంతానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని కలవాలని, ప్రభుత్వం తరపున మృతురాలి కుటుంబానికి అండగా ఉండాలని హోంమంత్రికి సీఎం ఆదేశాలు జారీ చేశారు. నిందితులను తక్షణమే అరెస్టు చేసి వేగవంతంగా దర్యాప్తు చేసి నిందితులకు కఠిన శిక్ష పడేలా చూడాలన్నారు సీఎం చంద్రబాబు. దర్యాప్తులో అలసత్వం లేకుండా.. జాప్యం జరగకుండా చూడాలని సీఎం ఆదేశించారు. సీఎం ఆదేశాలతో హత్య జరిగిన ఈపురుపాలెంకు హోంమంత్రి అనిత బయలుదేరారు.

ఇదిలా ఉండగా.. సీఎం చంద్రబాబుతో డీజీపీ ద్వారకా తిరుమల రావు భేటీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా సీఎం చంద్రబాబును డీజీపీ ద్వారకా తిరుమల రావు కలిశారు. చీరాల మండలం ఈపూరు పాలెంలో మహిళ హత్యోందతాన్ని సీరియస్‌గా తీసుకోవాలని డీజీపీకి సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు.

జగన్ అభ్యర్థనకు చంద్రబాబు గ్రీన్ సిగ్నల్

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): అసెంబ్లీ ప్రారంభం తర్వాత తొలుత కొత్తగా ఎన్నికైన సభ్యులు ప్రమాణ స్వీకారం చేస్తారు. తొలుత చంద్రబాబు, మంత్రుల తర్వాత అక్షర క్రమంలో ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేయాల్సి ఉంటుంది. అలాగే ఉంటుందని ప్రకటించారు కూడా. అయితే, వైసీపీ నుంచి వచ్చిన అభ్యర్థన మేరకు ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రభుత్వం మినహాయింపునిచ్చింది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాభవం ఎదుర్కొన్న జగన్ సారథ్యంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా కూడా కోల్పోయింది. ఆ పార్టీ కేవలం 11 స్థానాలు మాత్రమే గెలుచుకుంది. దీంతో ప్రతిపక్ష హోదా కోల్పోయింది. ఈ నేపథ్యంలో మంత్రుల ప్రమాణ స్వీకారం తర్వాత జగన్ ప్రమాణ స్వీకారానికి అనుమతించాలని, ఆయన కారును కూడా లోపలికి అనుమతించాలంటూ వైసీపీ నుంచి వచ్చిన అభ్యర్థనకు చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. ఈ విషయాన్ని శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కూడా సానుకూలంగా స్పందించారు. ఈ రోజు వరకు జగన్ కారును లోపలికి అనుమతించాలని నిర్ణయించారు. అలాగే, మంత్రుల ప్రమాణ స్వీకారం తర్వాత జగన్‌తో ప్రమాణ స్వీకారానికి ప్రభుత్వం అంగీకరించింది.

రేషన్ షాపు విషయంలో ఇరువర్గాల ఘర్షణ - 8మందికి తీవ్రగాయాలు



సత్తెనపల్లి (జర్నలిస్ట్ ఫైల్) :: రేషన్ షాపు విషయంలో చోటు చేసుకున్న వివాదం కొట్లాటకు దారితీసింది. ఒకే పార్టీ ఒకే సామాజిక వర్గానికి చెందిన ఇరువర్గాలు ఒకరిపై ఒకరు రాళ్ళు రువ్వుకున్నారు. ఈ సంఘటన సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల పంచాయతీ పరిధిలోని భాగ్యనగర్ కాలనీ లో గురువారం రాత్రి జరిగింది. ఈ ఘటనలో ఇరువర్గాలకు చెందిన 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టిడిపి నాయకులు రేషన్ షాపుల కోసం పోటీ పడుతున్నారు. ఈ నేపథ్యంలో గాడిదపాటి చిన్నబ్బాయి, రాజేష్, అలాగే చిలకా వీరయ్య, చిలకా అశోక్ లు పోటీ పడ్డారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. ఈ సంఘటనలో ఎనిమిదిమంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నలుగురు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు ఆసుపత్రికి తరలించారు.

జర్నలిస్ట్ ఫైల్
మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా.. సకాలంలో పేపరు అందడం లేదా.. సంప్రదించండి - 7661805968
అతితక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరుమార్పు, లీగల్ ప్రకటనలకు... సంప్రదించండి - 7416812467

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467